క్లుప్తంగా

నూతన కార్యవర్గం నియామకం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జంబిహనుమాన్ ఆలయం దసరా నూతన ఉత్సవ కమిటీ సభ్యుల వివరాలను ఆలయ ఈవో రవీంధర్ మంగళవారం ప్రకటించారు. జంబిహనుమాన్ ఆలయ దసరా ఉత్సవ కమిటీ చైర్మన్‌గా రేగుళ్ల సత్యనారాయణను నియమించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం జరిగే దసర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. కమిటీ సభ్యులుగా దోండి రమణ, భోజన్న, హరీష్, నారాయణ, గోపికిషన్, పింజ రవి నియమితులయ్యారు. ఉత్సవాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్యను, ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డిని పాల్గొనాలని ఉత్సవ కమిటీ చైర్మన్ రేగుల సత్యనారాయణ కోరారు. వారికి ఆహ్వాన పత్రికను అందజేశారు.

టౌన్ ప్లానింగ్ విభాగంపై సమీక్ష



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం టౌన్ ప్లానింగ్ విభాగంను టౌన్‌ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్ నర్సింహారెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా డైరెక్టర్ నర్సింహరెడ్డి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పది శాతం భూముల ఆక్రమణపై, అనుమతులపై విచారణ చేపట్టారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో అనుమతుల విషయంలో తీసుకుంటున్న నియమ నిబంధనలను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యభామ, టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సుమల, స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారి ఆంజనేయులు, మున్సిపల్ మేనేజర్ హయ్యూం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో ఫీవర్ సర్వే



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని బీచ్‌గల్లి ,సైదబాద్, రాంనగర్, సంతోష్ నగర్, హౌసింగ్ బోర్డు కాలనీలో మంగళవారం అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ఫీవర్ సర్వే, డ్రైడే నిర్వహించారు. ఈసందర్భంగా వైద్య సిబ్బంది ఇంటికికీ తిరుగుతూ.. ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. సబ్‌యూనిట్ అధికారి సాయి, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, బట్టు రాజవ్వ, మమత, సాగర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం పలువురు లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు పంపిణీ చేశారు.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పులి శ్రీనివాస రావు, తహసీల్దార్ ధన్వాల్, జైతాపూర్ సింగిల్ విండో చైర్మన్ నారాయణ, నాయకులు మనోజ్, ఈరేటి లింగం, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.


ముగిసిన కబడ్డీ శిక్షణ శిబిరం



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో ముప్కాల్‌స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ఈనెల 3నుంచి కబడ్డీ క్రీడాకారులకు స్థానిక ఇండోర్ స్టేడియంలో శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా కబడ్డీ అసోషియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ.. క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలన్నారు. శిక్షణకు సహకరించిన ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సభ్యులు అంజయ్య, గంగారెడ్డి, సాయన్న, ఉదయ్, కంచు నరేష్, పీడీ రాజుకుమార్ పాల్గొన్నారు.

అలీసాగర్ గేటు ఎత్తివేత

ఎడపల్లి(బోధన్): నిజాంసాగర్ ప్రధాన కాలువ ద్వారా 300 క్యూసెక్కుల నీరు మండలంలోని అలీసాగర్ రిజర్వాయర్‌లోకి వస్తుండటంతో రిజర్వాయర్ పూర్తి ఎఫ్‌టిఎల్ లెవెల్‌కు చేరుకుంది. దీంతో 300 క్యూసెక్కుల నీటిని అలీసాగర్ ఒక గేటు పైకెత్తి ఇరిగేషన్ శాఖ అధికారులు వదిలారు.



డబుల్ బెడ్‌రూం ఇళ్లు కొందరికేనా?

- బాల్కొండలో 170 ఇళ్ల నిర్మాణం
- 100 ఇళ్ల పంపిణీ పూర్తి
- మిగిలిన వాటిని ఇప్పటికీ పంపిణీ చేయని అధికారులు



బాల్కొండలో పంపిణీ చేయని డబుల్ బెడ్‌రూం ఇళ్లు

బాల్కొండ: మండల కేంద్రంలో 170 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించగా 100 ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మిగిలిన 70ఇళ్లను అధికారులు పంపిణీ చేయకుండా అలాగే వదిలేశారు. దీంతో పేదలు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కొందరికేనా? మిగిలిన వాటిని పంపిణీ చేయరా అంటూ అధికారులను ప్రశ్నిస్తున్నారు.

2017లో శంకుస్థాపన.. 2023లో పూర్తి..

బాల్కొండ మండల కేంద్రంలో 100 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించాలని 2017లో పనులకు శంకుస్థాపన చేశారు. పనులు కొనసాగుతుండగానే అప్పటి ప్రభుత్వం మరో 70 ఇళ్ల నిర్మాణాలకు మంజూరు ఇవ్వడంతో ఆ ఇళ్లను కూడ నిర్మించారు. పనులు ఆగుతు.. సాగుతూ 2023 జనవరిలో పూర్తయ్యాయి. కానీ పంపిణీ చేపట్టలేదు. లబ్ధిదారుల ఎంపిక కోసం దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఎంపిక ప్రక్రియ చేపట్టారు. అన్ని చేసిన కూడ పంపిణీని ఆలస్యం చేశారు. గత అసెంబ్లీ ఎన్నిక సమయంలో కొంతమంది లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ చేశారు. 170 ఇళ్లలో 100 ఇళ్లు మాత్రమే కేటాయించగా.. పంపిణీలో అనేక అవతవకలు జరిగాయలని అప్పట్లో పెద్ద ధుమారమే రేగింది. ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించడంతో అప్పటి అధికార పార్టీలోనే పెద్ద రచ్చజరిగింది. ఇదంత జరిగినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. 100 ఇళ్ల పంపిణీ ప్రక్రియాను పూర్తి చేశారు. కానీ మిగతా 70ఇళ్లను మాత్రం ఏడాదిగా ఊరిస్తునే ఉన్నారు. ఎందుకు వాటి పంపిణీ చేపట్టలేదో అంతుచిక్కడం లేదు. మండలకేంద్రంలో సుమారు 480మంది డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు.

మెండోరా మండల కేంద్రంలో..

మెండోరా మండల కేంద్రంలో 60 ఇళ్ల నిర్మాణం కోసం 2017లో శంకు స్థాపన చేశారు. ఇప్పటికీ ఆ ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. ప్రస్తుతం రంగులు వేసే పనులు కొన్నింటికి జరుగుతున్నాయి. ఆ ఇళ్లను కూడ దసరా వరకు పంపిణీ చేయాలని లబ్ధిదారులు వేడుకుంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అయినా స్పందించి ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఎలాంటి ఆదేశాలు రాలేవు..

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ కోసం ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేవు. ఎందుకు పంపిణీ జరగలేదో సమాచారం లేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆదేశాలు రాగానే పంపిణీ చేపడతాం.

– శ్రీధర్, తహసీల్దార్, బాల్కొండ

ఘనంగా బతుకమ్మ సంబురాలు



నందిపేటలో బతుకమ్మ వేడుకలలో వైద్య సిబ్బంది



ఎస్సారెస్పీ జెన్‌కోలో..

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది అందరూ కలిసి పీహెచ్‌సీ ఆవరణలో వివిధ రకాల పూలను పేర్చుతూ బతుకమ్మను తయారు చేశారు. బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. అనంతరం స్థానిక తాడి చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, పీహెచ్‌ఎన్ పద్మావతి, సూపర్‌వైజర్‌లు సురేందర్, భాస్కర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జెన్‌కోలో..

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద గల జల విద్యుదుత్పత్తి కేంద్రంలో జెన్‌కో మహిళా ఉద్యోగులు బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బతుకమ్మ పాటలతో, కోలాటంతో సందడి చేశారు. అనంతరం బతుకమ్మను కాకతీయ కాలువలో నిమజ్జనం చేశారు.

నేడు ఆర్మూర్ మున్సిపల్ ఆధ్వర్యంలో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జంబిహనుమాన్ ఆవరణలో బుధవారం మున్సిపల్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య అన్నారు. ఈసందర్భంగా జంబి హనుమాన్ ఆలయ ప్రాంగణాన్ని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఆమె మంగళవారం పరిశీలించారు. సాయంత్రం 6గంటల నుంచి బతుకమ్మ సంబురాలు ప్రారంభం అవుతాయన్నారు. పట్టణ మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి వేడుకలను విజయవంతం చేయాలన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ రేగుల్ల సత్యనారాయణ, టీఎంసీ సభ్యురాలు ఉదయ్‌శ్రీ, సభ్యులు దోండి రమణ తదితరులు పాల్గొన్నారు.



జంబిహనుమాన్ ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య

మహాలక్ష్మి నమోస్తుతే..



ఆర్మూర్‌లో హోమం నిర్వహిస్తున్న భక్తులు



రాణంపల్లిలో..



ఆర్మూర్‌లో కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు



రుద్రూర్ మండలంలో..

సాక్షి నెట్‌వర్క్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పలుచోట్ల మహాలక్ష్మి దేవిగా, పలుచోట్ల సరస్వతిదేవిగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లోని దేవి మండపాల వద్ద మహిళలు కుంకుమార్చనలు, దీపారాధన, కలశపూజలు నిర్వహించారు. అలాగే మండపాల నిర్వాహకులు అన్నదానాలు ఏర్పాటు చేశారు. డొంకేశ్వర్‌లోని సత్య గంగవ్వ కళ్యాణ మండపంలో కొలువు దీరిన దుర్గామాతను రూ.9.99 లక్షల నగదుతో అలంకరించారు. రెంజల్ మండలంలోని వీరన్నగుట్టలో దుర్గమ్మను రూ. 5.16 లక్షలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఎడపల్లిలోని దేవి మండపాల్లో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముప్కాల్‌లో అమ్మవారికి బోనాలను ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. రుద్రూర్ దుర్గాదేవి మండపంలో మహిళలకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు.







డొంకేశ్వర్‌లో దుర్గామాతకు రూ.9.99 లక్షల నగదుతో అలంకరణ.. వీరన్నగుట్టలో రూ. 5.16 లక్షలతో.. వేల్పూర్‌లో..







ముప్కాల్‌లో బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు.. ఎడపల్లిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి.. పెర్కిట్‌లో..

పీఆర్టీయూ రాష్ట్రస్థాయి పదవుల్లో వేల్పూర్ వాసులు



వేల్పూర్: పీఆర్టీయూ రాష్ట్రకౌన్సిల్ సమావేశాలు ఇటీవల నిర్వహించగా రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటించారు. వేల్పూరు మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు రాష్ట్ర పదవులు వరించాయి. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా పెంట జలంధర్, హరిచరణ్, పతాని గంగాధర్, సీహెచ్ కాంతయ్య, అంబుజారాణి, దేవరాజ్, విజయ్ కుమార్, రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రవీందర్, రామ్ చందర్, రాజేందర్‌గౌడ్, సురేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులుగా, దత్త ప్రసాద్, చంద్రదేవ్, శ్రీదేవిలకు రాష్ట్ర కార్యవర్గంలో చోటు లభించింది. హైదరాబాద్‌లో మంగళవారం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్ రెడ్డి, దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో వారు ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్ రెడ్డి, కిషన్, దేవానందం, నరసింహారావు పాల్గొన్నారు.

వేం నరేందర్ రెడ్డికి వినతి

నిజామాబాద్ సిటీ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని రాష్ట్ర కోఆపరేటీవ్ యూనియన్ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్‌లోని గిరిజన వసతి గృహంలో గిరిజన ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. గిరిజన శాఖ సీఎం పరిధిలో ఉండడంతో ఈ అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. మోహన్‌రెడ్డి వెంట ఎస్టీ సెల్ నాయకుడు చంద్రునాయక్ ఉన్నారు.

మున్సిపల్ కార్మికుడి మృతి

బోధన్‌టౌన్(బోధన్): పట్టణ శివారులోని పసుపు వాగు సమీపంలో ఉన్న పంట పొలాల్లో మున్సిపల్ కార్మికుడు కత్తి పోచయ్య (50) మృతి చెందాడు. సీఐ వెంకటనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మోస్రా మండలం గోవూర్ గ్రామానికి చెందిన కత్తి పోచయ్య మున్సిపల్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈనెల 3వ తేదీన గోవూర్ నుంచి బోధన్‌కు తన అల్లుడితో వచ్చిన పోచయ్య.. మున్సిపాలిటీకి వెళ్లి తన వేతన బకాయిల గురించి ఆరా తీశారు. ఆధార్ నంబర్ తప్పుగా నమోదు కావడం వల్ల వేతం రావడం లేదని మున్సిపల్ అధికారులు తెలిపారు. అక్కడి నుంచి వెనుదిరిగిన పోచయ్యను అతని అల్లుడు సాయంత్రం సమయంలో రాకాసీపేట్ వద్ద వర్ని వెళ్లే ఆటో ఎక్కించాడు. మార్గమధ్యంలో పసుపు వాగు వద్ద ఆటో దిగిన పోచయ్య.. తన కూతురికి ఫోన్ చేసి తాను ఆటో ఎక్కడ దిగానో తెలియడం లేదని తెలిపాడు. ఆరోజు నుంచి కుటుంబ సభ్యులు పోచయ్య కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఇదిలా ఉండగా, పసుపు వాగు సమీపంలోని పంటపొలాల్లో ఓ వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, విచారణ చేపట్టిన పోలీసులు ఆ మృతుడిని పోచయ్యగా నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తన తండ్రి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని మృతుడి కుమారుడు చిన్న అబ్బయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బీజేపీ శ్రేణుల సంబురాలు

బోధన్‌టౌన్(బోధన్): హర్యణా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో బోధన్‌లో మంగళవారం పార్టీ శ్రేణులు సంబురాలు నిర్వహించారు. టపాసులు పేల్చి, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు అడ్లూరి శ్రీనివాస్, మాసిని వినోద్, సుధాకర్‌చారీ, ధర్మపురి, పెర్క వెంకటేష్, సందీప్, పప్పుల వేణు, గంగాధర్, భూమేష్ తదితరులు ఉన్నారు.

కెనాల్ పరిశీలన



ఎడపల్లి(బోధన్): మండలంలోని జైతాపూర్ గ్రామంలో 46/4 కెనాల్‌ను చీఫ్ ఇంజనీర్ మధుసూదన్‌రావు మంగళవారం పరిశీలించారు. కెనాల్స్ వద్ద జరిగే పనుల ఎస్టిమేషన్ వివరాలను అధికారులకు అడిగి తెలుసుకున్నారు. అధికారులు బద్రి నారాయణరావు, హైమద్‌జానీ, లోక్యనాయక్, ఉన్నారు.

వాహనాల తనిఖీ



ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలో మంగళవారం బోధన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, రూరల్ సీఐ విజయ్ బాబు, ఎస్సై వంశీధర్‌రెడ్డి వాహనాల తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు చూపించని 18 మోటర్ బైక్‌లను ఎడపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

సంక్షిప్తం

ఏసీపీకి 'స్వాతంత్ర్య అంశాల సేకరణ' పుస్తకం అందజేత



ఆర్మూర్: ఆర్మూర్ ఏసీపీ కార్యాలయంలో మంగళవారం విద్యార్థుల కోసం సామాజిక సేవకుడు పట్వారి తులసి కుమార్ రూపొందించిన స్వాతంత్ర్య అంశాల సేకరణ పుస్తకాన్ని ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డికి అందజేశారు. సేవ కార్యాక్రమాలు చేపడుతున్న పట్వారి తులసి నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమని ఆయన అభినందించారు.

పాఠశాలకు డెస్క్ బెంచీల వితరణ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మంగళవారం బాల్కొండ మండలం చిట్టాపూర్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఏనుగు దయానంద్‌రెడ్డి డెస్క్ బెంచీలను వితరణ చేశారు. హెచ్‌ఎం నారాయణ, గ్రామ సర్వజన సంఘం సభ్యులు వెంకటరాములు, గణేష్, సాగర్, జహీర్ సయ్యద్, ఎర్రయ్య, రాజు, రమేష్ పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జిరాయత్ నగర్‌లో గల విద్యాహైస్కూల్‌లో మంగళవారం రక్షణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు ఖాందేష్ శ్రీనివాస్, ప్రతినిధులు ప్రవీణ్‌పవార్, నరహరి, విద్యాగోపికృష్ణ, తులసి, శ్రీధర్, సత్యం, శ్రావణ్ పాల్గొన్నారు.

గైనిగుట్ట ప్రాంతంలో సర్వే

రుద్రూర్: మండలంలోని కొందాపూర్ శివారులోని గైనిగుట్ట ప్రాంతంలో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్నారని గత కొన్ని రోజులుగా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందచేశారు. దీంతో స్థానిక తహసీల్దార్ ఆదేశాల మేరకు మంగళవారం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖాజ నజీరోద్దిన్, సర్వేయర్ శ్రీనివాస్ గైనిగుట్ట ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం కొలతలు వేసి సర్వే చేశారు. ప్రాథమిక నివేదిక రూపొందించి అధికారులకు అందచేస్తామని వారు పేర్కొన్నారు.

కాంగ్రెస్ నేత రాజారెడ్డిని కలిసిన నాయకులు



రెంజల్(బోధన్): మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకుడు అంతరెడ్డి రాజరెడ్డిని మంగళవారం మండల యువజన కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. యువజన కాంగ్రెస్ నాయకులు కార్తీక్, కిరణ్, కృష్ణ, మదుక్రిష్ణ, శ్రీకాంత్, శివకుమార్, సురేష్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు దుస్తుల పంపిణీ

రెంజల్: రెంజల్ గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు మంగళవారం ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్ దుస్తులను అందజేశారు. సూపరింటెండెంట్ శ్రీనివాస్, కార్యదర్శి రాజేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో సీఎం చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన వీరేందర్‌సింగ్‌ను మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవోతోపాటు కార్యాలయం ఉద్యోగులు సన్మానించారు.

బోధన్ స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా హన్మండ్లు చారి

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా బొప్పరం హన్మండ్లు చారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని విశ్వకర్మ సంఘం భవనంలో మంగళవారం స్వర్ణకార సంఘం సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో స్వర్ణకార సంఘం ప్రతినిధులు అధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జీపీ కార్మికులకు చేయూత



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు ఓ దాత ఆర్థిక చేయూత అందించారు. గ్రామానికి చెందిన గుగ్గిలం దేవరాజ్ ఉపాధి నిమిత్తం ఇజ్రాయెల్ దేశం వెళ్లాడు. మూడేళ్ల క్రితం పారిశుధ్య కార్మికుల సంక్షేమం కోసం రూ. 4.50 లక్షలు డిపాజిట్ చేశాడు. ప్రతి సంవత్సరం వడ్డీ రూపంలో వచ్చిన రూ. 70వేల నగదును పారిశుధ్య కార్మికులకు దసరా కానుకగా అందిస్తున్నారు. మంగళవారం ఇందుకు సంబంధించిన నగదును వీడీసీ సభ్యులు కార్మికులకు ఒక్కొక్కరికి రూ. 5700 చొప్పున అందజేశారు. వీడీసీ అధ్యక్షుడు రామస్వామి, కోశాధికారి నూకల బుచ్చిమల్లయ్య పాల్గొన్నారు.

డీజే ఆపరేటర్లు లైసెన్స్ తీసుకోవాలి

బాల్కొండ: డీజే ఆపరేటర్లు పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి రుసుం చెల్లించకుండ దరఖాస్తులు చేసుకుని ఏడాదిపాటు లైసెన్స్ తీసుకోవాలని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చట్టానికిలోబడి పోలీస్ అధికారులు డీజేలకు అనుమతి ఇస్తారన్నారు. డీజేలను ప్రజలకు ఇబ్బంది కలగకుండ ఆపరేట్ చేసుకోవాలన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	బహిర్భూమి (తెలుగు) - 10.50, మిస్టర్ సెలెబ్రిటీ (తెలుగు) - 1.30 చిట్టిపొట్టి - 4.15 జోకర్ ఫోలి ఏ డేయస్ (ఇంగ్లీష్) - 7.15 సత్యం సుందరం - 10.30
స్క్రీన్-2	దేవర(తెలుగు)-11.00, 02.35, 6.10, 9.45
స్క్రీన్-3	కాళి (తెలుగు) - 11.05 జోకర్ ఫోలి ఏ డేయస్ (ఇంగ్లీష్) - 1.15, దక్షిణ (తెలుగు) - 4.30, దేవర - 7.00, రామ్‌నగర్ బన్నీ - 10.35
స్క్రీన్-4	స్వాగ్ (తెలుగు) - 12.00, 3.20, 6.40, 10.00

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	దేవర పార్ట్-1 - 12.55 4.10,
స్క్రీన్-2	దేవర పార్ట్-1 (తెలుగు)- 10.30 సత్యం సుందరం - 1.40 7.30 రామ్‌నగర్ బన్నీ -4.30 10.30
స్క్రీన్-3	స్వాగ్ (తెలుగు)- 10.25 1.30 7.30 10.30 దక్షిణ (తెలుగు)-4.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	దేవర పార్ట్-1 (తెలుగు)- 11.15 2.50 6.25 10.00
స్క్రీన్-2	స్వాగ్(తెలుగు)-12.25 7.00 జోకర్ ఫోలి ఏ డేయస్ (ఇంగ్లీష్)-3.45 సత్యం సుందరం(తెలుగు)-10.20
స్క్రీన్-3	జోకర్ ఫోలి ఏ డేయస్(ఇంగ్లీష్)-12.35 6.00 9.15 కాళి(తెలుగు)- 3.50
స్క్రీన్-4	బహిర్భూమి (తెలుగు)-11.05 మిస్టర్ సెలెబ్రిటీ (తెలుగు)-1.45 చిట్టిపొట్టి (తెలుగు)-4.30 దక్షిణ (తెలుగు)-7.30 రామ్‌నగర్ బన్నీ (తెలుగు)-10.00
లలితామహల్	దేవర పార్ట్-1(తెలుగు)
దేవి	స్వాగ్ (తెలుగు)
నటరాజ్	సత్యం సుందరం (తెలుగు)
విజయ్	దేవర పార్ట్-1(తెలుగు)

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)		
		డ్రెస్స్‌డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	78,400	వెండి (కిలో)	94,500
22 క్యారెట్స్	72,335		

– నిజామాబాద్ బిజినెస్